క్లుప్తంగా

జంబులమ్మకు ప్రత్యేక పూజలు



పూజలందుకున్న అమ్మవారు

పాములపాడు: మండలంలోని జూటూరు గ్రామంలో శుక్రవారం జంబులమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం నిర్మాణం చేపట్టి జమ్ములమ్మ విగ్రహ ప్రతిష్ఠ చేసి ఏడాది పూర్తయిన సందర్భంగా గ్రామస్తులు అమ్మవారి ప్రథమ వార్షికోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కాయ కర్పూరం, పసుపు, కుంకుమ, గాజులు, నూతన వస్త్రాలు సమర్పించి మొక్కులు చెల్లించారు.

గడ్డి వామి దగ్ధం



కాలిపోతున్న గడ్డివామి

బండిఆత్మకూరు: మండలంలోని లింగాపురం గ్రామానికి చెందిన రైతు శాంసన్ గడ్డి వామి దగ్ధమైంది. శుక్రవారం మధ్యాహ్నం గడ్డివామి నుంచి మంటలు ఎగిసి పడటాన్ని గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారమిచ్చారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని మంటలకు ఆర్పివేశారు. ప్రమాదంలో రూ.50 వేల విలువైన గడ్డి అగ్నికి ఆహుతైనట్లు రైతు పేర్కొన్నాడు.

మల్లన్నకు పల్లకోత్సవం



స్వామి అమ్మ వార్లకు పల్లకీ సేవ

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానంలో మూల నక్షత్రాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్వామిఅమ్మవార్లకు పల్లకీ ఉత్సవాన్ని నిర్వహించారు. ముందుగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకులు సేవా సంకల్పాన్ని పఠించారు. తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ జరిపించారు. అనంతరం స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో కొలువుంచి శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు జరిపారు.

వైభవంగా తిరుచ్చి మహోత్సవం



తిరుచ్చి మహోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

బేతంచెర్ల: మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి స్వామి వారికి తిరుచ్చి మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉప కమిషనర్ రామాంజనేయులు, వేదపండితులు కళ్యాణచక్రవర్తి.. మద్దిలేటి నరసింహస్వామిని పుష్పాలతో అలంకరించి పల్లకీలో కొలువుంచి, కాగడాల వెలుతురులో ఆలయ మాడ వీధుల్లో గోవిందనామ స్మరణలతో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ రామ్మోహన్‌రావు, అర్చకులు మనోహర్, నరసింహ పాల్గొన్నారు.

బైకును ఢీకొన్న కారు

- ఇద్దరికి గాయాలు



.ప్రమాదానికి కారణమైన కారు

డోన్ టౌన్: జాతీయ రహదారి దొరపల్లె క్రాస్ వద్ద శుక్రవారం బైకును కారు ఢీకొనడంతో డోన్‌కు చెందిన రవి, జలదుర్గానికి చెందిన ప్రేమ్‌కుమార్‌లు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు.. బెంగళూరు నుంచి హైదరాబాద్ వైపు కారు వెళ్తుండగా బాధితులు బైకుపై యు.కొత్తపల్లె దాబా వద్ద టీ తాగి పట్టణంలోకి వస్తుండగా ప్రమాదం చోటుచేసుకుంది. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం డోన్ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

కంప్యూటర్ కోర్సులో ఉచిత శిక్షణ

డోన్ టౌన్: ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు బెంగళూరులో కంప్యూటర్ ట్యాలీ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ అడ్మిషన్స్ కో ఆర్డినేటర్ హరిప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి ఆపైన పాస్ అయిన వారు అర్హులన్నారు. శిక్షణ అనంతరం ఉద్యోగవకాశాలు కల్పిస్తామన్నారు. 35 రోజుల కోర్సులో కంప్యూటర్ స్కిల్స్, ట్యాలీ, జీఎస్టీ, స్పోకెన్ ఇంగ్లీషు, లైఫ్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్, వర్క్ ప్లేస్ ఎథిక్స్ తదితర వాటిల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ సమయంలో భోజనం, వసతి సౌకర్యాలు కల్పిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 90004 87423 నంబరును సంప్రదించాలన్నారు.

త్యాగానికి ప్రతీక గుడ్‌ఫ్రైడే

త్యాగానికి ప్రతీక గుడ్‌ఫ్రైడే అని పలువురు క్రైస్తవ మత పెద్దలు పేర్కొన్నారు. గుడ్‌ఫ్రైడే వేడుకలను నందికొట్కూరు, శ్రీశైలం నియోజకవర్గాల వ్యాప్తంగా క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. ఉదయాన్నే చర్చిలకు వెళ్లి సామూహిక ప్రార్థనలు చేశారు. ఏసు గీతాలను ఆలపించారు. మత పెద్దలు బైబిల్ చదివి వినిపించారు. శిలువపై ఏసు పలికిన ఏడు మాటలను వివరించారు. సమస్త మానవాళి పాప క్షమాపణ కోసం ఏసు ప్రాణ త్యాగం చేశారని తెలిపారు. శిలువపై ఏసు చిందించిన రక్తం మానవాళికి పాప పరిహారం అవుతుందన్నారు. క్షమాపణ, శత్రువులను ప్రేమించడం వంటి సుగుణాలను ఏసుప్రభువు జీవితం ద్వారా గ్రహించాలన్నారు. అనంతరం ప్రార్థనల్లో పాల్గొన్న భక్తులకు అన్నదానం చేశారు.



మిడుతూరు ఆర్‌సీఎం చర్చి గురువులు సిలువను మోస్తున్న దృశ్యం, నందికొట్కూరు: సీఎస్ఐ చర్చిలో ఏసుక్రీస్తు గురించి ప్రసంగిస్తున్న రెవరెండ్ ఫాదర్

నందికొట్కూరు: నందికొట్కూరు, మిడుతూరు మండలాలలోని సీఎస్ఐ, ఏబీఎం, హోసన్న, ఆర్‌సీఎం, సీయోను తెలుగు బాప్టిస్టు చర్చి, తదితర ప్రార్థన మందిరాల్లో గుడ్‌ఫ్రైడే వేడుకలను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. మిడుతూరు ఆర్‌సీఎం చర్చి ఉప్పలదడియా విచారణలో గురువులు శిలువలను మోశారు. నందికొట్కూరు టౌన్ సీఎస్ఐ చర్చిలో జరిగిన వేడుకల్లో రెవరెండ్ ఫాదర్ ఇమ్మానియేల్ బాబు, చర్చి కార్యదర్శి జానీ క్రిసోస్టమ్, కోశాధికారి జయచంద్ర, ఏబీఎం, ఆర్‌సీఎం, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కల్వారిగిరిలో శిలువ ధారియై..



శ్రీశైలంప్రాజెక్ట్ వీధుల్లో శిలువధారి ప్రదర్శన

శ్రీశైలంప్రాజెక్ట్: 'కల్వారిగిరిలో శిలువధారియై వేలాడినావా ఏసయ్యా' అంటూ బాధాతప్త గీతంతో క్రైస్తవులు శుభ శుక్రవారం నిర్వహించుకున్నారు. శ్రీశైలంప్రాజెక్ట్ పురవీధుల్లో శిలువధారి ప్రదర్శన చేశారు. అన్ని చర్చిలలో ఉపవాస ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఇహలోక పాపుల రక్షణ నిమిత్తం శిలువలో తన రక్తాన్ని చిందించిన ఏసుక్రీస్తును కొనియాడుతూ ప్రార్థనలు చేశారు.

కొత్తపల్లి: మండలంలో క్రైస్తవులు గుడ్‌ఫ్రైడేను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. కొత్తపల్లి, ఎం.లింగాపురం, శివపురం, సింగరాజుపల్లె, ముసలిమడుగు, ఎర్రమఠం గ్రామాల్లో సీఎస్ఐ సంఘం చైర్మన్ భరత్‌దివాకర్ బాబు, గువ్వలకుంట్ల, జీ.వీరాపురం, కొత్తపల్లి, గుమ్మడాపురం గ్రామాలలోని ఆర్సీఎం చర్చిలలో ఫాదర్ బెర్నాడ్, దుద్యాల, కొక్కెరంచ గ్రామాలలోని సీఎస్ఐ చర్చిలలో సంఘ చైర్మన్ జీవన్ ఇమ్మానియేల్, దుద్యాల ఏబీఎం చర్చిలో సంఘ గురువు రవికుమార్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

- జూపాడుబంగ్లా: తాటిపాడు, పారుమంచాల, మండ్లెం, తంగడంచ, జూపాడుబంగ్లా, 80బన్నూరు, తరిగోపుల, తూడిచెర్ల తదితర గ్రామాల్లోని చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మానవాళి పాపములను తన భుజంపై వేసుకొని ఏసుక్రీస్తు మోశాడని ఫాదర్లు తెలిపారు. క్రీస్తు సూచించిన సన్మార్గంలో నడవాలన్నారు. అనంతరం క్రీస్తు శిలువను ఆయా గ్రామాల్లోని పురవీధుల్లో భక్తులు మోశారు.



కొత్తపల్లి సీఎస్ఐ చర్చిలో ప్రసంగిస్తున్న సంఘ చైర్మన్ భరత్‌దివాకర్ బాబు

- పగిడ్యాల: మానవాళి పాప విమోచనం కోసం యేసుక్రీస్తు సిలువ మోసి తన ప్రాణాన్ని త్యాగం చేశారని పాస్టర్ సావందరాజు, సీహెచ్ పాల్ క్రైస్తవులకు బోధించారు. శుక్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలను పగిడ్యాల, నెహ్రూనగర్, పాత, కొత్త ముచ్చుమర్రి, లక్ష్మాపురం, ప్రాతకోట, ఎం.ఘణపురం తదితర గ్రామాల్లో క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. క్రీస్తు జీవితం మానవాళికి ఆదర్శమని మత పెద్దలు వివరించారు.



పాములపాడు జెరూసలేం శాలలో ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు

- పాములపాడు: మండలంలోని అన్ని గ్రామాల్లో క్రైస్తవులు గుడ్ ఫ్రైడే వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఆయా గ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మహా త్యాగానికి గుర్తు గుడ్ ఫ్రైడే అని బోధకులు వివరించారు. మానవాళి పట్ల ప్రతి ఒక్కరూ ప్రేమ, కరుణ కలిగి ఉండాలని, శత్రువుల పట్ల కూడా జాలి, దయతో మెలగాలని వివరించారు.



ఆత్మకూరు సీఎస్ఐలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు, ప్రసంగిస్తున్న పాస్టర్ కలబండి త్యాగరాజు

- ఆత్మకూరు: ఆత్మకూరు మండలంలో క్రైస్తవులు గుడ్ ఫ్రైడే వేడుకలను ఆనందోత్సవాల మధ్య నిర్వహించుకున్నారు. ఇందిరానగర్, ఎస్పీజీ పాలెం, ఏబీఎం పాలెం తదితర ప్రార్థనా మందిరాల్లో పాస్టర్లు యేసుక్రీస్తు జననం, మరణం, పునర్జననంపై వివరించారు.

- బండిఆత్మకూరు: గుడ్ ఫ్రైడేను పురస్కరించుకుని మండల వ్యాప్తంగా ఉన్న క్రైస్తవులు ప్రార్థనలు నిర్వహించారు. లింగాపురం సీఎస్ఐ చర్చిలో పాస్టర్ అర్జున్ బైబిల్ గురించి వివరించారు.



బండిఆత్మకూరు: లింగాపురం సీఎస్ఐ చర్చిలో ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు

21న రాష్ట్రస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు

ఆత్మకూరు: మండలంలోని కరివేన గ్రామంలో ఈస్టర్‌ను పురస్కరించుకుని ఈనెల 21న రాష్ట్రస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు సీఎస్ఐ ప్రార్థనా మందిరం సంఘం పెద్దలు తెలిపారు. పోటీల ప్రారంభ కార్యక్రమానికి రావాల్సిందిగా డీఎస్పీ రామాంజినాయక్‌ను, సీఐ రామును కలిసి శుక్రవారం ఆహ్వాన పత్రికలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యూ కేటగిరీ వృషభాలకు మొదటి బహుమతి రూ.50 వేలు, రెండో బహుమతి రూ.40 వేలు, మూడో బహుమతి రూ.30 వేలు, నాలుగో బహుమతి రూ.20 వేలు, ఐదో బహుమతి రూ.15 వేలు, ఆరో బహుమతి రూ.10 వేలు, ఏడో బహుమతి రూ.5 వేలు చొప్పున అందజేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న ఎడ్ల యజమానులు రూ.600 ప్రవేశ రుసుం చెల్లించి రశీదు పొందాలన్నారు. మరిన్ని వివరాలకు 6281655869 నంబర్‌ను సంప్రదించాలన్నారు.



పోటీల ప్రారంభ కార్యక్రమానికి డీఎస్పీని ఆహ్వానిస్తున్న సీఎస్ఐ సంఘం పెద్దలు

పల్లకీలో విహరించిన మహానందీశ్వరుడు

మహానంది: మహానందిలో శుక్రవారం రాత్రి పల్లకీ సేవ నిర్వహించారు. ఈఓ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేద పండితులు అర్చకులు కామేశ్వరీదేవి, మహానందీశ్వర ఉత్సవమూర్తులను అలంకరించారు. అలంకార మండపంలో గణపతి పూజ, అలంకార పూజలు చేసి స్వామి, అమ్మవార్లను పల్లకీలో కొలువుంచి ఆలయ ప్రాకారాల్లో ఉత్సవం నిర్వహించారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ పి.సుబ్బారెడ్డి, సిబ్బంది, భక్తులు పల్లకీ ఉత్సవంలో పాల్గొన్నారు.

మహానందీశుడి దంపతులకు కల్యాణోత్సవం

మహానందిలో కొలువైన గంగ, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి దంపతులకు శుక్రవారం కల్యాణం కమనీయంగా సాగింది. ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి, సూపరింటెండెంట్ అంబటి శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, అర్చకులు ధర్మతేజ, పండితులు స్వామి, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి గణపతిపూజ, పుణ్యాహవాచనం, మాంగళ్య ధారణ, అక్షతల సమర్పణ పూజలు చేశారు.



మహానందిలో పల్లకీసేవ దృశ్యం

మహానందిలో రద్దీ

మహానందిలో శుక్రవారం భక్తుల రద్దీ నెలకొంది. వేసవికాలం కావడంతో పాటు సెలవురోజు ఉండటం, ఆలయ ప్రాంగణంలో పెళ్లిళ్లు జరగడంతో వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తులు స్థానిక రుద్రగుండం, బ్రహ్మగుండం, విష్ణుగుండం కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వర స్వామి వార్లను దర్శించుకున్నారు.

ప్రాథమిక తరగతుల విలీనాన్ని రద్దు చేయాలి

నంద్యాల(న్యూటౌన్): 1, 2 తరగతులను కూడా హైస్కూళ్లలో విలీనం చేయడం సబబు కాదని ఎస్‌టీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రాథమిక తరగతులను హైస్కూళ్లలో విలీనం చేస్తే ప్రాథమిక విద్యావ్యవస్థ నిర్వీర్యమయ్యే అవకాశం ఉందన్నారు. ఉపాధ్యాయులను కేటాయించే సందర్భంలో ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తిని చూడకూడదన్నారు. సమావేశంలో ఎస్‌టీటీఎఫ్ నాయకులు రాము, రవీంద్రబాబు, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాసులు

వయ్యారిభామతో ఊపిరితిత్తుల వ్యాధులు

మహానంది: వయ్యారిభామ(పార్థీనియం) మొక్కలతో ఊపిరితిత్తుల వ్యాధులు సంభవించే ప్రమాదం ఉందని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి.జయలక్ష్మి తెలిపారు. తమ్మడపల్లెలో రెండోరోజు జాతీయ సేవా పథకం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు శుక్రవారం పిచ్చి మొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ శ్రీనివాస రెడ్డి, డాక్టర్ మాధవి పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి మృతి

జూపాడుబంగ్లా: మండలంలోని మండ్లెం గ్రామ సమీపంలో ఉన్న ఎర్రకుంట వాగు ప్రాంతంలో మతిస్థిమితం లేని వ్యక్తి మృతిచెందాడు. ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపిన వివరాలు.. మండ్లెం గ్రామానికి చెందిన కుమ్మరి చెన్నయ్య(55) మతిస్థిమితం లేక తిరుగుతుండేవాడు. ఆరు రోజుల క్రితం ఇంటి నుంచి ఎటో వెళ్లిపోయిన చెన్నయ్య శుక్రవారం గ్రామానికి సమీపంలో శవమై కనిపించాడు. అటుగా పొలాలకు వెళ్లిన రైతులు మృతదేహం పడిఉందని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ తన సిబ్బందితో ఘటనా ప్రాంతానికి చేరుకుని విచారించారు. మృతదేహంపై ఉన్న షర్టును గుర్తించి మృతుడు తన భర్తేనని చెన్నయ్య భార్య కుమ్మరి కుర్వమ్మ పోలీసులకు తెలపడంతో మృతదేహాన్ని అప్పగించారు.

నవంబర్‌లో ప్రపంచ తెలుగు సాహితీ సంబరాలు

డోన్: తెలుగు భాష సంస్కృతితో పాటు కళలు తెలుగు ప్రజల మధ్య శాశ్వతంగా ఉండేందుకు స్వచ్ఛంద సేవా సంస్థలు ఎనలేని కృషి చేస్తున్నాయని తెలుగు కవి డాక్టర్ అనుగోలు సంజీవరాయుడు అన్నారు. శుక్రవారం ఆయన తన స్వగృహంలో మాట్లాడుతూ ఏలూరుకు చెందిన శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఈ ఏడాది నవంబర్ 10న పట్టాభిషేక మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏలూరులోని మహాలక్ష్మి గోపాలస్వామి కల్యాణ మండపంలో జరిగే ప్రపంచ తెలుగు సాహితీ సంబరాలకు తెలుగు భాషాభిమానులందరూ హాజరుకావాలని ఆయన కోరారు.

పని ప్రదేశంలో టెంట్లు ఏర్పాటు చేయాలి

ఆత్మకూరు: ఉపాధి కూలీల పని ప్రదేశాల్లో టెంట్లు ఏర్పాటు చేసి వడదెబ్బ నుంచి కాపాడాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎం.నరసింహనాయక్, మండల నాయకురాలు నూర్జహాన్ కోరారు. శుక్రవారం ఇందిరేశ్వరం గ్రామం సమీపంలో ఉపాధి పనులను పరిశీలించారు. కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మెడికల్ కిట్లు సమకూర్చాలన్నారు. పెండింగ్‌లో ఉన్న తొమ్మిది వారాల వేతనాలు వెంటనే విడుదల చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ప్రతి జాబ్‌కార్డుకి 200 రోజులు పనులు కల్పించి, రోజు వారి వేతనం రూ.600 ఇవ్వాలన్నారు. మేటీలకు రూ.5 వేల చొప్పున పారితోషికం ఇవ్వాలని డిమాండ్ చేశారు.



కూలీలతో మాట్లాడుతున్న జిల్లా సహాయ కార్యదర్శి ఎం.నరసింహనాయక్

అగ్ని ప్రమాదాలపై అవగాహన



పెట్రోల్ బంకు సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఆత్మకూరు: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా 5వ రోజు శుక్రవారం పట్టణంలోని రిలయన్స్ పెంట్రోల్ పంపు వద్ద అగ్నిమాపక ప్రమాదాలపై అగ్నిమాపక అధికారి బి.భీముడునాయక్ ఆధ్వర్యంలో సిబ్బంది అవగాహన కల్పించారు. పెట్రోల్ బంకు వద్ద అగ్నిప్రమాదం జరిగినప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక అధికారి బి.భీముడునాయక్ మాట్లాడుతూ ప్రమాదాలు జరగకుండా అగ్నిమాపక నిబంధనలను ప్రతిఒక్కరూ పాటించాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది మోహన్‌రాజు, జిలానీ, నరసింహస్వామి, రఫిక్, శ్రీనివాసులు, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు



తలపడుతున్న క్రీడాకారులు

బేతంచెర్ల: పట్టణంలోని చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని స్థానిక శేషారెడ్డి హైస్కూల్ మైదానంలో రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వీరారెడ్డి, ప్రశాంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను ఎస్ఐ రమేష్ బాబు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు బుగ్గన ప్రభాకర్ రెడ్డి ప్రారంభించారు. 16 జట్లు పాల్గొన్నాయి.

గాలివాన బీభత్సం

ఆత్మకూరు, కొత్తపల్లి, పాములపాడు మండలలాల్లో గాలివాన బీభత్సం సృష్టించింది. శుక్రవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. ఫలితంగా అక్కడక్కడా వృక్షాలు విరిగిపడ్డాయి. విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. ఆరబెట్టుకున్న పంట దిగుబడులు సైతం తడిసిపోయి అన్నదాతకు నష్టం వాటిల్లింది.



ఆత్మకూరు సమీపంలోని వైఎస్సార్ స్మృతివనంలో కురుస్తున్న వర్షం

- విరిగిపడిన వృక్షాలు.. తడిసిన ధాన్యం

ఆత్మకూరు: ఆత్మకూరు మండలంలోని పలు గ్రామాల్లో పెనుగాలులు విధ్వంసం సృష్టించాయి. ఓ మోస్తారు నుంచి భారీ వర్షం కురవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. తీవ్ర ఎండగా ఉన్న సమయంలో ఒక్కసారిగా మేఘాలు కమ్ముకుని ఈదురుగాలులతో కూడిన వర్షం పడటంతో చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. నల్లమల అటవీ ప్రాంతంలో వడగండ్ల వర్షం పడింది. పొగాకు పంటకు తీవ్ర నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

- కొత్తపల్లి: మండలంలోని బండినాయిని పాలెం, పాలెంచెరువు, గువ్వలకుంట్ల,జి.వీరాపురం, బావాపురం, నందికుంట, దుద్యాల, కొక్కెరం, ఎదురుపాడు, గోకవరం గ్రామాల్లో మోస్తారు వర్షం కురిసింది. బట్టువారిపల్లె, సింగరాజు పల్లె గ్రామాల్లో వడగండ్లతో కూడిన వర్షం కురిసింది. గువ్వలకుంట్ల ఎస్సీ కాలనీలో ఓ ఇంటిపై ఉన్న రేకుల కప్పు ఈదురు గాలుల ధాటికి లేచిపోయింది. దీంతో ఇంట్లో ఉన్న బియ్యం బస్తాలు వర్షానికి తడిచిపోయాయి. నందికుంట గ్రామ శివారులో ఓ రైతు పొలంలో ఉన్న పొగాకు తడిపోయింది. కొత్తపల్లి మండల కేంద్రంలో బీసీ కాలనీలో డ్రైనేజీ లేక నీళ్లు రోడ్డుపై మోకాలి లోతు నిలువడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఎదురుపాడు నుంచి జడ్డువారిపల్లె వెళ్లే దారిలో ఈదురుగాలులకు రోడ్డుకు అడ్డంగా ఓ పెద్ద చెట్టు విరిగి పడింది. సింగరాజుపల్లె గ్రామ సమీపంలో కొత్తగా వేసిన విద్యుత్ స్తంభాలు నేల కొరిగాయి.



ఎదురుపాడులో రోడ్డుకు అడ్డంగా విరిగిపడిన చెట్టు



నందికుంట సమీపంలో పొలంలో వర్షానికి తడిసిన పొగాకు

- పాములపాడు: మండలంలోని కర్నూలు - గుంటూరు ప్రధాన రహదారితో పాటు పలు గ్రామాల్లో భారీ వృక్షాలు నేలకొరిగాయి. వృక్షాలు విద్యుత్ తీగలపై పడడంతో అవి తెగిపోయి విద్యుత్ అంతరాయం ఏర్పడింది. వాహనాల రాకపోకలు నిలిచి ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఆరు బయట ప్రాంతాల్లో ఆరబోసిన ధాన్యం దిగుబడులు తడిసిపోయాయి.

జొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభం

వెలుగోడు: మండలంలోని రేగడ గూడూరు గ్రామ రైతు సేవ కేంద్రంలో ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్వింటా జొన్నలు రూ.3,371 మద్దతు ధరతో ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. ఒక రైతు నుంచి ఎకరాకు 20 క్వింటాళ్ల చొప్పున ఐదు ఎకరాల దిగుబడులను సివిల్ సప్లై శాఖ అధికారులు డీసీఎంఎస్ ద్వారా కొనుగోలు చేయనున్నట్లు చెప్పారు. కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమానికి సివిల్ సప్లై డీఎం రాజు, ఏఓ పవన్, డీసీఎంఎస్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.